# మళ్ళీ అమరావతి కథలు

## సత్యం శంకరమంచి

# ఓ నరుడా! వానరుడా!



ముసలి సత్తెయ్య ఇంటింటి ముందుకూ వచ్చి కోతిని ఆడిస్తున్నాడు. కోతి చెంగు చెంగున గెంతుతోంది. కోతి నుదుటిమీద పొడుగ్గా తిలకం, మెడ పట్టికి చిన్న చిన్న మువ్వలు. సత్తెయ్య వెదురు బద్దతో తాళం వేస్తూ "తనక తనకజం తనక తనకజం...రాములోరికి దణ్ణం పెట్టు... సీతమ్మోరికి దణ్ణం పెట్టు...లచ్చన్న సామికి దణ్ణం పెట్టు" అంటూ పాడుతూ ఆడిస్తున్నాడు. ఆ ఆటకి కోతి మెడలో మువ్వలు ఘల్లుఘల్లు మంటున్నాయి.

కోతికి ఓ మాసికల చొక్కా. ఆ చొక్కాకి ఓ జేబు. ఆ జేబులో శనగ పప్పులు, మధ్య మధ్య ఆట ఆపి కోతి ఓ గింజ నోట్లో వేసుకుంటుంది. ఆట ఆపంగానే సత్తెయ్య గొంతు పెంచి 'తనక తనకజం' అంటూ టాంగున నేలమీద కొడతాడు. ఉలిక్కిపడ్డట్టు కోతి అంతెత్తు ఎగిరి మళ్ళీ ఆడుతుంది. ఆ ఎగరడం చూసి పిల్లలెవరైనా 'ఇహి' అని నవ్వితే తను 'ఇహిహి' అని పళ్ళికిలిస్తుంది.

కొంచెం జనం చేరి ఉత్సాహంగా చూడ్డం మొదలెట్టగానే ఆట వరస మారుస్తాడు సత్తెయ్య. "నా దేవుడా ఆడరా... తనక తనకజం...నా రావుడా ఆడరా...నా కొడకా ఆడరా... నా పెళ్ళావా ఆడవే" అనంగానే కోతికి ఎంత కోపమో! ఆట ఆపి పళ్ళు బిగపట్టి 'కరుస్తా' అన్నట్టు ఎగిరి సత్తెయ్య మీదకి దూకుతుంది. ఆ కోపమూ, ఆ కరవబోవడమూ అది కూడా ఆటలో భాగమే! అలా నేర్పాడు సత్తెయ్య.

అలా ప్రతి ఇంటి ముందు ఆడించుకుంటూ ఒంటిగంట వేళ కృష్ణ వొడ్డుకొచ్చి అన్నం వండుకుని కోతికి పెట్టి తను తిని, కోతిని గుండెల మీద పడుకోబెట్టుకుని ఏంత చెట్టు కింద నడుం వాలుస్తాడు సత్తెయ్య.

ఎక్కడదీ కోతి? ఎక్కడ పుట్టి ఎక్కడ పెరిగిందో!

సత్తెయ్యకి అటువారూ, ఇటువారూ అంతా వెళ్ళిపోయాక తనొక్కడే భూమ్మీద ఎందుకు మిగిలాడో తెలియని సమయంలో, పొట్ట గడవాలి కాబట్టి అడవిలో కట్టెలు కొట్టి తెచ్చేవాడు. సంవత్సరం క్రితం కట్టెల మోపు నెత్తిన పెట్టుకు తిరిగొస్తుంటే ఓ చెట్టుమీంచి కోతి కట్టెల మోపుమీదికి దూకింది. కంగారుపడి సత్తెయ్య కట్టెల మోపు వదిలేశాడు. మోపుతో కిందకు పడ్డ కోతి మళ్ళీ ఎగిరి సత్తెయ్య భుజం మీదికి వచ్చింది. ఎంత అదిలించినా వదల్లేదు. కిచకిచ నవ్వింది. కళ్ళలో కళ్ళు పెట్టి చూసింది. అంతే! సత్తెయ్య దాన్ని ఆప్యాయంగా నిమిరి చంకలో పెట్టుకు తీసుకొచ్చాడు. కోతికి పాత గుడ్డంతో చొక్కా కుట్టాడు. తనతోపాటు అన్నం అలవాటు చేశాడు. ఒకే కంచంలో తినేవారిద్దరూ. తనో ముద్ద కోతి నోట కందిస్తే కోతి లేచి తన చిట్టి చేతుల్తో నాలుగు మెతుకులు సత్తెయ్య నోట్లో పెట్టేది. ఆర్నెల్ల క్రితం సత్తెయ్యకి వయసు పైబడ్డది. సత్తువ మాయమయింది. కట్టెలు కొట్టి తేలేక దిగులుగా, నీరసంగా కూర్చున్న సత్తెయ్య ముందు కోతి చెంగు చెంగున తాళానికి ఎగరటం చూసి సత్తెయ్య కళ్ళు మెరిశాయి. ఆనాటి నుంచి కోతినాడిస్తున్నాడు. కోతి కష్టం తను తింటున్నాడు.

గుండెల మీద పడుకున్న కోతిని ప్రేమగా నిమురుతూ సత్తెయ్య అన్నాడు. "రః ముసలిబాగులోడు ఆఖరి రోజుల్లో గంజిలేక సచ్చిపోతాడని అడివిలోంచి పరుగెత్తుకొచ్చావురా! నా దేవుడా!" అంటూ కళ్ళనీళ్ళయిపోయాడు.

పండగొచ్చింది. కోతికి మాసికల చొక్కా ఉతికి తొడిగాడు. తిలకం మీద తిలకం దిద్దాడు. జేబునిండా శనగపప్పు పోశాడు. కొత్త పెళ్ళి కొడుకులా మహాసంబరంగా వుంది కోతి. అంత సంబరంతో ఆడిస్తున్నాడు సత్తెయ్య. 'తనక తనకజం' కోతి చిందులు తొక్కుతోంది. హొయలు పోతోంది. సిగ్గు నటిస్తోంది. గాలిలో ఎగురుతోంది. మొగ్గలేస్తోంది. పల్టీలు కొడ్తోంది. కిచకిచ నవ్వుతోంది. ఎగరేసిన రేగిపండు ఎగిరి అందుకుంటోంది. జనం పొంగిపోయేట్టు ఆడుతోంది. సత్తెయ్య జోలె నిండిపోతోంది. పప్పులు, కూరలు, బద్దలు, బొబ్బట్లు, గారెలు.

ఆనందంగా క్రిష్ట వొడ్డుకొచ్చి జోలె వంచుకుని తినటం మొదలెట్టారిద్దరూ. కోతి తినలేకపోతోంది. అలిసిపోయిందేమోనని సత్తెయ్య బలవంతంగా తినిపించాడు. కడుపునిండా తిని కోతిని - గుండెల మీద పెట్టుకుని చెట్టు కింద పడుకుంటే సత్తెయ్యకి నిద్రపట్టింది. నిద్రలేచి "నా దేవుడా, నా తండ్రీ, నా కొడకా" అని కోతిని పలకరిస్తే కోతి పలకలేదు. కంగారుగా చూశాడు సత్తెయ్య. కోతి సత్తెయ్యని ఒంటరివాణ్ణి చేసి వెళ్ళిపోయింది. సత్తెయ్య చచ్చిపోయిన కోతిని గుండెలకి హత్తుకున్నాడు. నుదుట మళ్ళీ తిలకం దిద్దాడు. అలనాడు అడవిలో కట్టెల మోపు మీదికి దూకిందే ఆ చెట్టు దగ్గరకి మోసుకెళ్ళాడు. గొయ్యి తీసి మెత్తగా పసిపాపని పడుకోబెట్టినట్టు పడుకోబెట్టి, ఆఖరి సారి కోతి మెడలో మువ్వలు కదిలించి, మట్టి కప్పి, ఎదురుగా కూర్చుని వెదురు బద్దతో నేలమీద కొడ్తూ "తనక తనకజం...రాములోరికి దణ్ణం పెట్టు సీతమ్మకి దణ్ణం పెట్టు..." అంటూ రాత్రంతా పాడాడు.

మూడు రోజులు గడిచాయి. సత్తెయ్యకి ముద్ద లేదు. కూలికి పోవటానికి ఓపిక లేదు. ఓపిక లేకపోయినా ఆకలి మంట ఆగదు.

ఉన్నట్టుండి లేచాడు సత్తెయ్య. వెదురు బద్ద తీసుకున్నాడు-ఇంటింటి ముందుకీ వచ్చాడు. "తనక తనకజం..." ఆడుతున్నాడు. తనే ఆడుతున్నాడు. తనే కోతయి, కోతిలా ఆడుతున్నాడు. కోతిలా రెండు చేతులూ నేల కానించి ఆడుతున్నాడు. "రాములోరికి దణ్ణం పెట్టూ...సీతమ్మోరికి దణ్ణం పెట్టు...కోతిలా పళ్ళికిలిస్తున్నాడు. కోతిలా కిచకిచలాడుతున్నాడు. కోతిలా శనగపప్పు తింటున్నాడు. కోతిలా మొగ్గలేస్తున్నాడు. పల్టీలు కొడ్తున్నాడు. కోతిలా గాలిలోకి ఎగరలేక ఎగురుతున్నాడు.

ఆహా! జనమంతా ఆట చూస్తున్నారు. కోతి ఆట చూసినట్టే సత్తెయ్య ఆట కూడా చూస్తున్నారు.

ఆట చూస్తున్న అయ్యల్లారా! పిల్లలుగన్న తల్లుల్లారా! అమ్మలగన్న అమ్మల్లారా! కోతి సాయం పొందిన దేవుణ్ణి కొలిచే దేవతల్లారా! సత్తెయ్య గొంతు చీరుకుపోయేట్టు పాడుతున్నాడే! ఎముకలు విరిగేట్టు ఆడుతున్నాడే! నెత్తురింకిపోయేట్టు ఎగురుతున్నాడే! కళ్ళముందు మనిషి జంతువు కంటే హీనమైపోతున్నాడే! కోతి ఆట చూసినట్టు ఆనందించి పైసలేస్తున్నారా అయ్యల్లారా!

*



# ముత్యాల వాగ